# జ్వాల

శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య

సముద్రపుగాలి 'హోరు'మని వేగంగా వీస్తున్నది. ఆకాశం నిర్మేఘంగా ఉన్నది. పరిసరాలలో ఉన్న సరివిచెట్ల తోపులలోనుంచి రకరకాల పక్షులు రకరకాలుగా ధ్వనులు చేస్తున్నాయి. ఒక రంగురంగులపిట్ట ముచ్చటగా అరుస్తూ హుషారుగా ఎగిరిపోతున్నది.

సారధి కారు ఆపి క్రిందికిదిగాడు. ఆ ఇసుకలో కారు ఇక ముందుకుపోవడం పడదు. తాళంచెవి చేతిలోకి తీసుకుని అతడు నెమ్మదిగా నడవటం ప్రారంభించాడు. అతని అడుగులు ఇసుకలో భారంగా పడుతున్నాయి. కొద్ది నిముషాలలోనే అతడు సముద్రతీరాన్ని చేరుకున్నాడు. అక్కడ అంతా 'రావణాసురుడి మీసా'లనబడే ముళ్లచెట్లు మొలిచి ఉన్నాయి. అక్కడక్కడ చిన్నచిన్న శంఖాలూ, నత్తగుల్లలూ ఉన్నాయి. తమతమబొరియలలోనుంచి ఎండ్రకాయలు కొన్ని అప్పుడప్పుడు బయటికి వచ్చి కాస్సేపు అటూ ఇటూ తిరిగి మళ్లీ లోపలికి వెళ్లిపోతున్నాయి. సముద్రంలో అలలు ఉవ్వెత్తున లేచి విరిగిపడిపోతున్నాయి. విపరీతమైన శక్తితో భువినంతటినీ ముంచివెయ్యాలనే దృఢనిశ్చయంతో బయలుదేరిన అలలు, తీరానికి వచ్చేసరికి విరిగిపడి, చెదిరిపోయి, తునియలైపోయి ఫేనమైపోతున్నాయి.

తీరానికి దగ్గరలోనే ఒక మంచినీళ్లబావీ, దానికి కొద్ది దూరంలోనే ప్రయాణికులు విడిదిచేసే బంగళా ఉన్నాయి. దానికి మరో యాభైగజాలదూరంలో ఒక ఇల్లున్నది. సారధి చూపు లక్కడే నిలిచిపోయాయి. అతని భ్రుకుటి ముడిపడింది. అతడు త్వరత్వరగా ఆవైపే నడిచాడు. బంగళా ముందు పంచలో స్తంభానికి ఆనుకుని కూర్చుని యాభై ఏళ్ల వ్యక్తి ఒకడు నిశ్చలంగా సముద్రంవైపు చూస్తున్నాడు. సారధి నడిచిపోతూనే అతన్ని గమనించాడు. అతడు ఆ బంగళా కాపలాదారు.

సారధి ఆ ఇంటిముందు ఆగిపోయాడు. అది ఒక పాత పెంకుటిల్లు. ఇంటికప్పు కుడిభాగం పూర్తిగా కూలిపోయింది. ఎడమభాగం కూడా అంత దృఢంగా లేదు. గోడలన్నీ శిథిలమైపోతున్నాయి. బ్రతికిచెడినవానివలె ఆ ఇల్లు శిథిలావస్థలో దీనంగా ఉంది.

సారధిమనస్సు కల్లోలితమైంది. అతడు ఒక్కక్షణం అలా ప్రమాన్పడి నుంచుని తర్వాత నెమ్మదిగా అడుగులువేస్తూ ఇంట్లో ప్రవేశించాడు. ఎడమవైపు ఉన్న గది బాగానే ఉంది. కిటికీలోనుంచి దూరంగా సముద్రం కనిపిస్తున్నది. గోడలలో చాలాచోట్ల సున్నం పెచ్చులూడిపోయింది. కిటికీ ఊచలు కొన్ని ఊడిపోయాయి.

ఒక పాత ఫోటో నేలమీద దుమ్ములో పడిఉన్నది. సారధి దాన్ని చేతిలోకి తీసుకుని దుమ్ముదులిపి చూశాడు. అది ఒక పెండ్లిఫోటో. వధూవరు లిద్దరూ మధుపర్కాలలో ఉన్నారు. వరుడు తాను కన్నకలలు నిజం కాకపోవన్న ధీమాతో కుర్చీలో కూర్చునిఉన్నాడు. ఆ కుర్చీచేతి నానుకుని బుగ్గన చుక్కతో నుదుట భాషికంతో నిలబడిఉన్నది పెండ్లికూతురు. ఎన్ని సంవత్సరాలక్రితం, ఏ శుభదినాన సాయంకాలం ఫోటోకోసం ఆ నూతనదంపతు లిద్దరూ అలా నిలబడ్డారో! ఇప్పు డా ఫోటో ఫ్రేము విరిగి చివరలు చిరిగిపోయి ఉంది. ఏవో పురుగులు కొట్టివేయగా అది తూట్లుపడిఉంది.

సారధి కిటికీవైపు చూశాడు. అవును! ఆ కిటికీ ప్రక్కనే మంచంలో పడుకుని దాదాపు పదేళ్లక్రితం నిర్భాగ్యుడైన ఒక క్షయరోగి శూన్యదృక్కులతో ఆకాశంలోకీ, సముద్రంవైపుకూ చూస్తూ ఉండేవాడు. ఆ మంచం ప్రక్కనే ఒక స్టూలుమీద రకరకాల మందుసీసాలు ఉండేవి. రవ్వంత కదిలితే, బుసలుకొట్టే పామువలె విజృంభించే దగ్గును అతడు అతిప్రయత్నంమీద అణుచుకునేవాడు. ఒక్క మాట మాట్లాడితే కొన్నినిముషాలపాటు దగ్గు అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసేది. అతడు ఎముకలపోగువలె ఉండి బరువుగా గాలిపీలుస్తూ ఉండేవాడు. ఆ మంచం ప్రక్కనే మరొక స్టూలుమీద కూర్చుని వేళకు మందులు కలిపి ఇస్తూ, పండ్లరసం పిండి ఇస్తూవుండే దొక నిర్భాగ్యురాలు. ఆమెకు ఇరవైయేళ్ల వయస్సు ఉండి ఉంటుంది. ఆమె రోగికి చేయగలిగిన సపర్యలన్నీ చేసిన తర్వాత నిశ్శబ్దంగా లేచివెళ్లి వెనకవైపు గుమ్మంలో నిలబడి నిస్తేజమైన ముఖంతో సముద్రం వంక చూస్తూవుండేది. నాలుగురోజుల కొకసారి సారధి కారుతో వచ్చి రోగిని పరీక్షించి మార్చవలసిన మందు లేవైనావుంటే మార్చి 'రోగిస్థితి మరీ అధ్వాన్నంగా లేదు. త్వరలోనే కోలుకుంటా'డని ఓదార్పుమాటలు చెప్పి వెళ్లిపోయేవాడు. ఆమె గుమ్మంలో నిలబడివుండి డాక్టరు చెప్పే ఓదార్పు మాటలు విని చీరెకొంగుతో కళ్లు తుడుచుకుని కరిగిపోతున్న ఆశను చిక్కబట్టుకునేది.

సారధి ప్రక్కగదిలోకి వెళ్లాడు. ఆ గది చిన్నది. ఆమె అక్కడే ఒంటరిగా పడుకుంటూ ఉండేది. మందు ఇవ్వటానికీ, మరేదైనా అవసరంవొస్తేనూ తప్ప రోగి

ఆమెను తనగదిలోకి రానిచ్చేవాడు కాదు. తనసమక్షంలో వుంటే ఆమెకుకూడా ఆ భయంకరవ్యాధి సోకుతుందని అతని భయం కాబోలు !

సారథి ఆ గదిలో అలాగే శిలావిగ్రహంవలె కొన్ని నిముషాలపాటు నుంచుండిపోయాడు. ఆనాడు .... తాను కారులో రోగిని జూసేందుకు సాయంకాలం దాదాపు ఆరుగంటలవేళ వచ్చాడు. అప్పటికే సూర్యాస్తమయమయి, చీకట్లు నలుదెసల కమ్ముకుంటున్నాయి. రోగిని పరీక్షచేసి, ఇంజెక్షను ఇచ్చి మందులసంచి చేతిలోకి తీసుకుని పంచలోకి వొచ్చేసరికి ఆకాశం జలార్ద్రమైనమేఘాలతో నిండి గర్జిస్తున్నది. మెరుపుతీగలు పదునైన కత్తులవలె మెరుస్తున్నాయి. ఆకాశం నిండుకుండవలె భయంకరంగా ఉంది. గుమ్మంలో సవ్వడికాగా తాను వెనుదిరిగి చూసి నివ్వెరపోయి, "మరేమీ ఫరవాలేదు. మీరలా దిగులుపడితే లాభంలేదు. నేను ఎన్నివిధాల వీలున్నదో అన్నివిధాల ప్రయత్నిస్తూనే ఉన్నాను. మానవ మాత్రులం అంతకంటె ఏం చెయ్యగలం ? మీరు అధైర్య పడకండి" అన్నాడు. ఆమె కళ్లు తుడుచుకున్నది. తాను చేతిలో సంచితో పంచదిగి చివరిమెట్టుమీదికి వచ్చేసరికి వర్షం ప్రళయ సదృశంగా రానేవచ్చింది. కొద్ది క్షణాలలోనే వర్షం కుండలతో కుమ్మరించినట్టు మహాభీకరంగా నిలిచి కురవటం ప్రారంభించింది. తాను మళ్లీ వెనక్కు తిరిగి పంచలోకి వెళ్లి నిలబడ్డాడు. ఆమె గుమ్మంలో నిలబడి 'డాక్టరుగారూ! మిమ్మల్ని వారు రమ్మంటున్నారు ....' అన్నది. తాను సంచిని ముందుగదిలో బల్లమీద ఉంచి జోళ్లు విప్పి రోగిగదిలోకి వెళ్లాడు. రోగి మంచం ప్రక్కన ఉన్న కిటికీతలుపు మూసివుంది. అతడు గుండెలదాకా దళసరిరగ్గు కప్పుకుని పడుకుని ఉన్నాడు. తనను చూసి కానుగపుల్లవలె సన్నగావున్న చేతితో 'కూర్చోమని' సంజ్ఞ చేసి, అతికష్టంమీద "మీరు ఈ వానలో అన్నిమైళ్లు ఎలా పోగలరు ? ఈ పూటకు ఇక్కడే ఉండిపొండి. తెల్లవారినతర్వాత వర్షం తెరపియిస్తే వెళ్లవచ్చు" అన్నాడు. ఈ కాసిని మాటలూ అని అతడు దాదాపు ఒక్క నిముషం సేపు ఊపిరాడక దగ్గుతో ఆయాసంతో బాధపడ్డాడు. తాను 'సరే' నన్నాడు. 'కాదు' అని సమాధానంచెప్పి నిర్భాగ్యుడైన ఆ రోగిచేత మరొకసారి చెప్పించుకుని అతన్ని ఆయాసపెట్టడం తెలివితక్కువ అనిపించింది. పైగా ఈ వర్షంలో కారుదగ్గరికి వెళ్లే లోపలే తాను పూర్తిగా తడిసిపోగల ప్రమాదం కూడా ఉంది. తాను 'సరే' అనగానే రోగి నిశ్చింతగా కళ్లుమూసుకు పడుకున్నాడు. ఆమె గుమ్మంలో నిలబడి అంతా విని తనపనిమీద వంటయింట్లోకి వెళ్లిపోయింది. తాను అలాగే చాలాసేపు సన్ననిదీపం వెలుతురులో మంచంమీద పడుకుని బరువుగా గాలిపీలుస్తున్న రోగివంక చూస్తూ కూర్చుని, తర్వాత లేచి వెళ్లి ముందుగదిలో చాపమీద కూర్చుని గోడకు తల ఆనించి కళ్లు మూసుకున్నాడు. అలా ఎంతసేపు మగతనిద్రపట్టిందో తెలియదు. ఆమె తనసమీపంలో నుంచుని ఉండి "డాక్టరుగారూ!" అని పిలుస్తూవుండగా మెలకువ వచ్చింది. ఆమె "వారికి మందు కలిపి ఇచ్చాను. మీరు భోజనానికి లేవండి. వొడ్డిస్తాను" అన్నది. తాను లేచి వెనుకవైపు పంచలోకి వెళ్లి అక్కడ సిద్ధంగా ఉన్న నీళ్లతో కాళ్లూ చేతులూ మొహమూ కడుక్కున్నాడు. ఆమె వంటయింటి గుమ్మంలో నిలబడి తువ్వాలు అందించగా తుడుచుకుని లోపలికి వెళ్లాడు. ఆమె తాను భోజనంచేస్తూవుండగా దగ్గరలో పీటమీద కూర్చుని ఏది అవసరమైనప్పుడు అది వడ్డించింది. తాను ఆమె ముఖంలోకి ఒక్కసారి చూశాడు. ఆమె చాలా అందమైనమనిషి. తెల్లని చీరె కట్టుకుని ఉంది. ఆమె మెడలో సన్నని బంగారపు గొలుసు ఒకటి ఉంది కాని అది ఆమె వొంటి రంగులో కలిసిపోయింది. విశాలమైన ఫాలభాగాన ముంగురులు గాలికి కదులుతున్నాయి. ఆమె కన్నులు విశాలములై నల్లగా ఉన్నాయి. తాను నిశ్చలంగా అలా కొన్నిక్షణాలు చూసేసరికి ఆమె తల వంచుకుంది. తర్వాత ఏమీ మాట్లాడకుండా భోజనం ముగించి తాను ముందుగదిలోకి వెళ్లిపోయాడు. ఆమె వెనుకనే వచ్చి ఎడమప్రక్క గదివైపు చూపిస్తూ 'మీరు ఈ గదిలో పడుకోండి' అన్నది. ఆగదిలో ఒక మంచంమీద పరుపూ శుభ్రమైన దుప్పటీ ఉన్నాయి. తెరిచివున్న కిటికీలోనుంచి నల్లని ఆకాశం కనిపిస్తున్నది. గాలివాలు మరొకవైపు ఉండటం వల్ల జల్లు లోపలికి పడటంలేదు. తాను పడుకుని కళ్లు మూసుకుని నిద్రపొయ్యేప్రయత్నం చేశాడు. కాని ఎంతసేపటికీ తనప్రయత్నం ఫలించలేదు. మనస్సంతా ఏవేవో అర్థంలేని ఆలోచనలతో సతమతమైపోతున్నది. దేన్ని గురించీ ఆలోచించకుండా కళ్లుమూసుకుని నిద్రపోవాలని ప్రయత్నం చేసికూడా విఫలుడై తాను అలాగే పడుకుని ఉండిపోయాడు. బయట వర్షం ప్రళయసదృశంగా కురుస్తూనే ఉన్నది. ఆకాశమూ, నేలా, సముద్రమూ ....ప్రకృతి అంతా నల్లని రంగు పూసిన చిత్తరువువలె ఉంది. ఎంత పొద్దుపోయిందో తెలియదు. ప్రక్కనే గుమ్మంముందు మరచెంబులోనుంచి గ్లాసులోకి నీళ్లు వంచుతున్న సవ్వడి అయింది. తాను లేచి గుమ్మందగ్గరికి వచ్చి 'నాక్కూడా కాసిని మంచినీళ్లు ఇవ్వరూ ?' అని అడిగాడు. ఆమె గ్లాసు తొలిచి నీళ్లు వొంచి తనచేతికి అందించింది. ఆమెచేతివ్రేళ్లు తనవ్రేళ్లకు తగలగానే శరీరంలో విద్యుత్తు ప్రవహించినట్టయింది. అంతవరకూ తన మనస్సును కలవరపెడుతున్న పశుప్రవృత్తి, మూత తీయగానే పాములబుట్టలోనుంచి 'బుస్సు'న లేచే నల్లత్రాచువలె విజృంభించింది. ఆ కిటికీప్రక్కనే తన చేతులలోనుంచి తప్పించుకునేప్రయత్నం చేసికూడా విఫలురాలై దీనంగా తనకు లొంగిపోయిం దామె.

గతాన్ని నెమరువేసుకుంటున్న సారథి ఉలిక్కిపడ్డాడు. ఏదో పక్షి కిటికీలో నిలబడి వికృతంగా అరిచింది. అతడు నెమ్మదిగా నడిచి బయటికి వచ్చాడు. సూర్యబింబం అస్త

మించబోతున్నది. ఎఱ్ఱని కాంతులు సముద్రానికి బంగారు పూత వేస్తున్నాయి. సన్నని చంద్రరేఖ అప్పుడే ఉదయించింది.

సారథి బంగళాముందుకు వచ్చేసరికి, అంతకుముందు పంచలో స్తంభాని కానుకొని కూర్చుని సముద్రంలోకి చూస్తున్న కాపలాదారు అక్కడ లేడు. అతడు ఆ రోజులలో ఆ ఇంటివారికి కావలసిన సరంజామా అంతా సమకూర్చి పెట్టేవాడు. తీరికసమయాలలో దీపంముందు కూర్చుని వచన భారతాన్ని కూడబలుక్కుంటూ చదువుకునేవాడు. సారథి అతనికోసం ఒక్కక్షణం చూసి తల పంకించి, "సరే రేపు కనుక్కోవచ్చులే" అనుకుని ముందుకు నడిచాడు. సముద్రానికి మైలుదూరంలో ఉన్న ఊళ్లో తన మేనమామ యింట్లో వారు తనకోసం ఎదురుచూస్తూ ఉంటారు. 'రాక రాక ఇన్నేళ్లతర్వాత ఈప్రాంతాలకు వచ్చా' డని తనను వారు ఎటూ కదలనియ్యటంలేదు. పైగా తన మేనమామకు చదరంగంపిచ్చి ఎక్కువ. ఆట తెలిసినవారు కనిపిస్తే వొదలడు. ఇప్పుడైనా తాను ఎంతో బలవంతంమీద ఇలా రాగలిగాడు.

కారుప్రక్కనే నిలబడి తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ వ్రేళ్లతో దాన్ని ముట్టుకుని ఆనందిస్తూ నిలబడి ఉన్నాడొక కుఱ్ఱవాడు. వాడికి తొమ్మిదేళ్ళు ఉంటాయి. సారథి వొస్తున్న సవ్వడి విని వాడు పరుగెత్తి పోబోయాడు. సారథి వాణ్ణి రెక్క పట్టుకుని ఆపి 'ఎందు కలా పరుగెత్తిపోతావు ? కారులో ఎక్కు. మీ ఇంటిదగ్గర దింపుతాను' అన్నాడు. వాణ్ణి లోపల ఎక్కించి తలుపుమూసి బయలుదేరాడు. వాడు సన్నగా, బలహీనంగా ఉన్నాడు. మొహంలో కుడికన్ను ఉండవలసినచోట ఒక గుంట ఉంది. మొహంనిండా మచ్చలున్నాయి. జుట్టు దుబ్బువలె పెరిగి భుజాలమీద పడుతున్నది. ఒంటికి ఉన్న బొందు లాగూ, చొక్కా బాగా మాసిపోయి ఉన్నాయి.

సారథి 'నీపే రేమిటి ?' అని అడిగాడు. వాడు వింతగా చూశాడు కాని బదులు పలకలేదు. మళ్లీ 'మీ ఇల్లెక్కడ?' అని అడిగాడు సారథి. దానికీ, వింతచూపులే తప్ప సమాధానం లేదు. సారథి పెద్దగా 'మీ అమ్మా, నాన్నా ఎక్కడ ఉంటారు ?' అని అడిగాడు. తర్వాత నివ్వెరపోయి తేరుకుని విషయం గ్రహించి "పాపం ! అంగవైకల్యానికి తోడు మూగతనంకూడానా ? ...." అనుకున్నాడు. అతనిమనస్సు జాలితో నిండిపోయింది. కుఱ్ఱవాడు, వేగంగా నడుస్తున్న కారులో కూర్చుని పొందగలిగిన గగుర్పాటునూ, ఆనందాన్నీ అనుభవిస్తున్నాడు.

ఊరి మొదట్లోనే ఇతర ఇళ్లకు దూరంగా ఉన్న ఒక పూరింటిముందుకు వొచ్చేసరికి వాడు సారథిచేతిమీద తట్టి 'ఆపమని' సంజ్ఞచేశాడు. సారథి కారు ఆపి తలుపు తీశాడు. వాడు క్రిందికి దిగి ఇంటిలోకి పరుగెత్తుకు వెళ్లి ఎవరినో చేయిపట్టుకుని బయటికి తీసుకువొచ్చి చూపించబోయేసరికి కారు దుమ్ము రేపుతూ మలుపుతిరిగి మాయమైపోయింది.

సారథి మేనమామ వాకిట్లో కూర్చుని అతనికోసం ఎదురుచూస్తున్నవాడల్లా లేచి నుంచుని "అమ్మయ్య ! వొచ్చావూ? ఎక్కడికి వెళ్లావో నని ఇందాకటినుంచి మీ అత్త దిగులు పడిపోతున్నది. త్వరగా ఆ 'డ్రస్సు' విప్పి రా. చదరంగం పరిచి సిద్ధంగా ఉంచుతాను." అన్నాడు. సారథి మ్లానంగా నవ్వి "ఉండు మామయ్యా ! నీకు ఏళ్ళు గడిచేకొద్దీ ఈ పిచ్చి ఎక్కువవుతున్నదేకాని తగ్గటంలేదు" అన్నాడు. ఆయన మేనల్లుడివెనకనే నడుస్తూ "ఆఁ! ఈ మధ్య ఆ ఆచార్లుగారు జబ్బుపడినప్పటినుంచీ ఆడేవాళ్ళు లేక నానా యాతనగానూ ఉంది. నువ్వు దేవుడల్లే వొచ్చావు. త్వరగా రా" అన్నాడు.

ఆపూట సారథి ఆట చూసి ఆయన ఆశ్చర్యపోయి "నీ మనస్సు ఎక్కడో ఉన్నట్టుందే ! కాస్త ఒళ్ళు దగ్గరపెట్టుకుని ఎత్తులు వెయ్యి" అన్నాడు.

*　　　*　　　*

మర్నాడు సాయంకాలం ఇసుకలో కారు ఆపి క్రిందికి దిగి గడియారం చూసుకున్నాడు సారథి. నాలుగు గంటలు దాటింది. అంతవరకూ తనప్రతాపం అంతా చూపించిన ఎండ క్రమంగా తగ్గుతున్నది. సముద్రపుగాలి అలలుఅలలుగా హాయిగా వీస్తున్నది. సారథితాళంచెవిగొలుసు చేత్తో తిప్పుకుంటూ ముందుకు నడిచాడు.

ప్రయాణికుల బంగళాలో ఎవరూ లేరు. తలుపు తాళం వేసిఉన్నది. సారథి పంచలో స్తంభాని కానుకొని కూర్చుని సిగరెట్టు వెలిగించాడు. తర్వాత చాలాసేపు నిశ్చలంగా సముద్రం వంక చూస్తూ కూర్చున్నాడు. క్రమంగా అతనిచూపులు దూరంగా ఉన్న ఇంటిమీదికి మళ్లినయ్. అతడు మళ్లీ చూపులను మరల్చుకోలేకపోయాడు. అతనిమనస్సు మళ్లీ కలగుండు పడిపోయింది.

వెనక చెప్పులచప్పుడయింది. సారథి వెనక్కుతిరిగి చూశాడు. బంగళా కాపలాదారు భుజాన ఒక చిన్న మూటతో నిలబడివుండి "ఎవరు బాబూ! మీరు ?" అని అడిగాడు. సారథి చెప్పగా తలపంకించి క్రిందకూర్చుని తాను తెచ్చిన సరంజామా అంతా సర్దుకున్నాడు. బియ్యమూ, కూరలూ, మిగిలిన చిల్లర సామానూ సర్దుకుని తల పైకెత్తి సారథివంక చూసి "అదేమిటి బాబుగారూ ! ఇక్కడికి వొచ్చేవాళ్లందరూ

సముద్రం చూడటానికే వస్తారు. మీరు ఆ పడిపోయిన ఇంటి వంక చూస్తూ కూర్చున్నారేం ?" అని అడిగాడు.

సారధి ఉలికిపడి, "అవును .... ఆ ఇంట్లో దాదాపు పదేళ్ల క్రితం ఒక క్షయరోగీ, అతని భార్యా ఉండేవారు. నేను అతనికి ఆరోజుల్లో మందులిచ్చేవాణ్ణి. అయిదుమైళ్ల దూరం నుంచి కారులో నాలుగురోజుల కొకసారి వొచ్చి పరీక్షచేసి మందులిచ్చి వెడుతూవుండేవాణ్ణి. అతని కప్పటికే ఆవ్యాధి బాగా ముదిరిపోయి ఊపిరితిత్తులను తినివేసింది. ఆతర్వాత నేను ఈ ప్రాంతాలనే విడిచి వెళ్లవలసి వచ్చింది. మళ్లీ ఇన్ని యేళ్లనుంచీ ఈవైపుకే రాలేకపోయాను. నిన్న వచ్చి చూస్తే ఆ ఇల్లు .... " అంటూ ఆగిపోయాడు.

ఆవ్యక్తి "మిమ్మల్ని ఇంతవరకూ గుర్తుపట్టలేక పోయాను బాబూగారూ ? ఇప్పుడు గుర్తుకు వొస్తున్నది.... నేను వాళ్లకు అప్పుడు కావలసిన సామానులూ, పండ్లూ తెచ్చి ఇస్తూవుండేవాణ్ణి .... ఆతల్లి నిజంగా దేవతవంటిది.... చల్లనివేళ తలపుకు వొస్తున్నది .... ఇంతమంది ఇన్ని విధాల పాటుబడినా లాభంలేకపోయింది..... ఆయన మీరు వెళ్లిన తర్వాత రెండునెలలకే చచ్చిపోయాడు .... నలుగురూ చేరి తలా ఒక చెయ్యీ వేసి అన్నిపనులూ పూర్తిచేశారు. ఆమె విలవిలలాడిపోయింది ... ఆ దుఃఖం పరాయివాళ్లకైనా వొద్దని పిస్తున్నది .... " అంటూ ఆగిపోయాడు. అతనిగొంతు గద్గదిక మయింది. సారధి చలించిపోయాడు. అయినా ఈ విషయం అనుకోనిదేమీ కాదు. అతడు 'తర్వాత ?' అని అడిగాడు. ఆ వ్యక్తి ఒక్క క్షణం ఆగి 'ఆమెతర్వాత అలాగే ఒంటరిగా ఆ యింట్లో కాలం గడిపేది. ఒంటరిగా వొదిలితే ఏ అఘాయిత్యం చేస్తుందో' నని నేను రాత్రింబగళ్లు ఆమెను కనిపెట్టుకుని ఉండేవాణ్ణి. ఆమె ఒకసారి నాతో 'నేను మొండిదాన్నిలే వెంకన్నా! చావు నాకు త్వరగా రాదులే. నేను ఏ అఘాయిత్యమూ చెయ్యను. నాకోసం నీ పనులు చెడగొట్టుకోవద్దు' న్నది. ఒకనాడు నేను మధ్యాహ్నంవేళ పుస్తకం చదివి వినిపించుకుందామని ఆ యింటికి వెళ్లేసరికి ఆమె వెనకవైపు పంచలో కూర్చుని వాంతిచేసుకుంటున్నది. నేను ఆశ్చర్యపోయి 'అమ్మా ! జ్వరమా' అని అడిగాను. ఆమె తల తిప్పి 'కాదులే వెంకన్నా !' అన్నది. ఆమెమొహం తెల్లగా పాలిపోయివుంది. ఆమె అలా ఉండగా నే నెప్పుడూ చూడలేదు. నాకు భయంవేసింది. ఆ నాటిరాత్రి నేను కన్ను మూయనైనాలేదు. అర్ధరాత్రివేళ నాభయం నిజమైంది. ఆమె కొంగు నెత్తిన కప్పుకొని విస విసా నడుస్తూ సముద్రంవైపు వెళ్లుతున్నది. నేను కేకలు వేస్తూ వెంటబడి నీళ్ల అంచులో ఆమెను పట్టుకో గలిగాను. నన్ను విదిలించుకుని ఏడుస్తూ "నన్ను చావనియ్యి వెంకన్నా! నేనిలా బ్రతకలే' నని ఆమె గోలచేసింది. నేను మొండికెత్తి బలవంతంగా లాక్కుని వచ్చాను. తర్వాత అసలువిషయం తెలిసింది. ఆమె కడుపుతో ఉంది .... " అంటూ అతడు ఆగి చుట్ట వెలిగించుకున్నాడు.

మళ్లీ ఒక్క క్షణం తర్వాత "అప్పటినుంచి ఆమెను నేను ఒక్కక్షణంకూడా విడిచి ఉండలేదు. 'రెప్పవేస్తే ఎక్కడ తప్పించుకు పోతుందో' అని ఇరవైనాలుగు గంటలూ ఆమెను కనిపెట్టుకుని ఉండేవాణ్ణి. తర్వాత నా తల్లి పూర్తిగా మారిపోయింది. ఎక్కడలేని ఓర్పూ, నిదానమూ అలవాటు చేసుకున్నది .... అలా తొమ్మిదినెలలూ మోసి నడివేసవిలో ఒక నాడుమధ్యాహ్నంపూట మగపిల్లవాణ్ణి కన్నది .... కాన్పు చాలా కష్టమైంది. పుట్టిన పిల్లవాడు ఏడవనైనాలేదు. ప్రాణం పోయినతర్వాతనే పిండం బయటికి వొచ్చిందనుకున్నాము. అయినా చిత్రంగా ఏవో నాటువైద్యాలు చెయ్యగా పిల్లవాడేమో కీచుమని ఏడ్చాడు. తల్లికి వాతంకమ్మి క్రమంగా స్పృహతప్పి ఆనాటి అర్ధరాత్రివేళకు చచ్చిపోయింది. నాకు పిచ్చెత్తినట్టయిపోయింది. తర్వాత కొన్నిరోజులవరకు ఆమెను మరచిపోలేకపోయాను. అయినా ఇన్నేళ్లు గడిచాక మరిచిపోక తప్పుతుందా బాబుగారూ ! ఇప్పుడైనా మీరు కదిలించబట్టి ఇదంతా జ్ఞాపకం వచ్చింది..... ఏమిటో" అంటూ నిట్టూర్చాడు.

సారధి తల త్రిప్పుకున్నాడు. అతని మొహం ఆ వ్యక్తికి కనుపించకుండా మధ్యలో స్తంభం అడ్డంగా ఉంది. పొద్దు గూకుతున్నది. బంగళా కాపలాదారు ఆరిపోయినచుట్టను మళ్లీ వెలిగించుకుని "ఆ పిల్లవాణ్ణి మీ మేనమామగారి ఊళ్లోనే ఒకళ్లు జాలితో దగ్గరకు తీసి పెంచుతున్నారు. వాడి కిప్పుడు ఎనిమిదేళ్లు వెళ్లినయ్. ఇంతవరకూ నోరు లేదు .... మూగి వెధవ .... పైగా ఒక కన్ను లొట్ట .... అవిటివాడు ..... ఎట్లా బ్రతుకుతాడో .... " అన్నాడు.

సారధి గుండుదెబ్బ తిన్నవాడివలె అదిరిపడ్డాడు. అతని మొహం పాలిపోయింది. అంత చల్లనిగాలిలోనూ అతని ఒళ్లంతా చెమటతో తడిసిపోతున్నది. జేబురుమాలుతో మొహం తుడుచుకున్నాడు. బంగళా కాపలాదారు లోపలి నుంచి దీపం తీసుకువొచ్చి పంచలో ఉంచి ఇసుకలో త్వర త్వరగా నడిచిపోతున్న అతన్ని చూసి ఆశ్చర్యపోయి తర్వాత నవ్వుకుని 'చిత్రమైనవాడు' అనుకున్నాడు.

*     *     *

సారధి మనశ్శరీరాలు రెండూ అతని వశంతప్పిన ట్టున్నాయి. అతడు తూలుతూ కారును సమీపించి ఎక్క

'స్టార్టు'చేశాడు. మాటిమాటికీ మొహం తుడుచుకుంటూ వేగంగా కారును నడపటం ప్రారంభించాడు. చీకటి చిక్కగా వ్యాపిస్తున్నది. సముద్రపుహోరు నిర్విరామంగా వినిపిస్తున్నది. కారుమీదుగా ఏదోపక్షి వికృతంగా అరుస్తూ ఎగిరిపోయింది. మట్టిబాట కటూ ఇటూ జీడిమామిడి చెట్లూ సరివి తోటలూ ఉన్నాయి. ఆ చెట్ల మధ్యలోనుంచి కీచురాళ్ళ విసుగులేకుండా అరుస్తున్నాయి.

ఊరికి దూరంలోనే సారథి నల్లని ఆకాశంలో ఎర్రని వెలుగును చూడగలిగాడు. ఊళ్లో ఏదో ఇల్లు కాలిపోతున్నది. తెల్లని పొగ ఎర్రని అగ్నిజ్వాలలను కప్పివుండి వ్యాపిస్తున్నది. వాయుదేవుడు తోడు కాగా మంట జిహ్వాలుకోస్తూ వ్యాపిస్తున్నది. కాలుతున్న వెదురువాసాలు ప్రేలుతూ చప్పుడు జేస్తున్నాయి.

సారథి ఊరుముందే కారు ఆపి పరుగెత్తాడు. ఊరికి దూరంగా ఉన్న ఇల్లు తగలబడిపోతున్నది. జనం మూగి ఉన్నారు. కొందరు కుండలతో నీళ్ళు కుమ్మరిస్తూ మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి ప్రయత్నం ఫలించటం లేదు. కొంతమంది గాలివాలు మరొకవైపుకు ఉండటంవల్ల మిగిలిన ఇళ్లకు ప్రమాదం లేదని సంతృప్తిపడుతున్నారు. ఒక ముదుసలి ఏడుస్తున్నది. ఆమె కొడుకూ, కోడలూ అక్కడే కూర్చుని ఉన్నారు. అందరూ నిలబడి చూడటంతప్ప మరేమీ చెయ్యలేకపోతున్నారు. సారథిచూపు లెవరి కోసమో వెదుకుతున్నాయి. ఇంతలో అతని గుండెలమీద సమ్మెటతో కొట్టినట్లు మాటలు వినవచ్చాయి. ముదుసలి ఏడుస్తున్నది "బుచ్చి ఏడిరా బాబూ ! ఎక్కడున్నాడో చూడండిరా .... "

తర్వాత పెద్ద గందరగోళం అయింది. బుచ్చి అనబడే ఆ మూగ పిల్లవాడు కనిపించనేలేదు. సారథి పిచ్చెక్కినవాడివలె మంటలలోకి పరుగెత్తి పోబోయాడు. అతని మేనమామ అతన్ని ఆపి "నీకు పిచ్చెక్కిందా ఏం ? అలా మంటలలోకి దూకుతా నంటావు. ఎవరుమాత్రం ఇప్పుడు చెయ్యగలిగింది ఏముంది ? మంట చల్లారితేతప్ప ఏమీ తెలియదు. వాడు ఇంట్లోనే ఉన్నాడని ఎలా అనుకోవటం ? ఎక్కడ తిరుగుతున్నాడో ఏమో !" అన్నాడు. నలుగురూ చేరి సారథిని ఆపివేశారు. అతడు ఆ చుట్టుపక్కల చూస్తూ ఏపిల్లవాడు కనిపించినా 'బుచ్చి' అనుకుని దగ్గరగావెళ్లి చూసి నిరాశచెందుతున్నాడు.

ఆవిధంగా గంటసేపు మహాభయంకరంగా విహరించి అగ్నిదేవుడు, నలుగురూ నీళ్లపోసి ప్రయత్నంచెయ్యడం వల్లనూ, మరే యిళ్లూ దగ్గరలో లేకపోవడంవల్లనూ తన ప్రతాపం చాలించాడు. ఇద్దరు సాహసికులు కాళ్లకు చెప్పులతో నెమ్మదిగా లోపల ప్రవేశించి చుట్టూ చూసి ఆందోళనతో పరుగెత్తుకువచ్చి 'బుచ్చి లోపలే ఉండిపోయాడు. ఒక మేకపిల్లకూడా అతని ప్రక్కనే ఉండి కాలిపోయింది. అబ్బ..' అన్నారు.

సారథి పిచ్చివాడివలె పరుగెత్తుకుపోయి చూశాడు. ఎదురుగా కనిపించిన దృశ్యం అతన్ని నిజంగా పిచ్చివాణ్ణే చేసింది. అతడు చేతులతో మొహం కప్పుకుని భయంతో వొణికిపోతూ ఇవతలికి వచ్చాడు.

ఆ రాత్రి అందరూ ఎంతగా బలవంతం చేస్తున్నా వినకుండా, ఒక్కమాట అయినా మాట్లాడకుండా పెట్టె, బెడ్డింగూ సర్దుకుని కారులో బయలుదేరి 'పదేళ్ళక్రితం ఒక నాటిరాత్రి కామంతో కళ్ళు మూసుకుపోయి చేసినపాపం ఊరికే పోలేదు. కట్టికుడిపింది. ఇదొక అగ్నిజ్వాల. జీవిత పర్యంతమూ ఈ జ్వాల మనస్సును దహించివేస్తూనే ఉంటుంది. ఈ పాపానికిక నిష్కృతి లేదు' అనుకున్నాడు సారథి.